

గురజాడ జయంత్యుత్సవం రేపు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంత్యుత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 9 గంటలకు గురజాడ స్వగృహంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. అక్కడ నుంచి గురజాడ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి, పూలమాలలతో నివాళులర్పించాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, పర్యాటకాధికారి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు
కర్నూలు ఉల్లి

- 13 టన్నులు దిగుమతి
- రైతు బజార్లలో విక్రయాలు



విజయనగరంలో వ్యాన్ నుంచి దించుతున్న కర్నూలు ఉల్లిపాయలు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉల్లిరైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిని కొనుగోలు చేసి వాటిని రైతుబజార్లలో విక్రయించేందుకు సిద్ధమవుతుంది. కర్నూలులో ఉల్లిధర పూర్తిస్థాయిలో పతనమైంది. అక్కడ కిలో 50 పైసలు పలుకుతుండడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో ఉల్లి రైతుకు ఊరటకల్పించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ.1,200 చొప్పున చెల్లించి ఆ ఉల్లిని రాష్ట్రంలోని రైతు బజార్ల ద్వారా విక్రయించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలోని రైతు బజార్లకు ఇప్పటికే దఫాదఫాలుగా కర్నూలు ఉల్లి దిగుమతి అయింది. శుక్రవారం మరో (మిగతా 8వ పేజీలో..)

- అనకాపల్లి వరకు 33 కిలోమీటర్లు ఏర్పాటు
- డీపీఆర్ సిద్ధం చేసిన రైల్వేశాఖ
- సర్వే కూడా పూర్తి.. భూసేకరణే మిగిలింది
- ఆందోళనలో రైతులు



కొత్తవలస మీదుగా రైల్వే బైపాస్ లైన్

కొత్తవలస, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్త రైల్వేలైన్ల ఏర్పాటుకు రైల్వేశాఖ సిద్ధమైంది. ఇప్పటికే కొత్తవలస నుంచి విజయనగరం వరకు 34.7 కిలోమీటర్ల పొడవున నాలుగో లైన్ల కోసం నాలుగు మండలాల్లో సుమారు 218 ఎకరాలను సేకరించింది. తాజాగా కొత్తవలస నుంచి అనకాపల్లి వరకు కొత్త బైపాస్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను సిద్ధం చేసింది. అవసరమైన భూమి కోసం కొత్తవలస మండలంలోని వివిధ గ్రామాలో సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేసింది. ఇవి కాకుండా విశాఖపట్నం (గోపాలపట్నం) రైల్వే స్టేషన్ నుంచి కొత్తవలస వరకు ఇప్పుడు ఉన్న నాలుగు రైల్వేలైన్లకు అదనంగా ఐదు, ఆరు రైల్వే లైన్‌లు ఏర్పాటు కోసం డీపీఆర్‌ను సిద్ధం చేసింది. ఇవన్నీ వచ్చే మూడు, నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని రైల్వే శాఖ భావిస్తోంది.



కొత్తవలస రైల్వేస్టేషన్

రద్దీని తగ్గించడానికి..

రాష్ట్రంలోని 11 మార్గాల్లో 1,960 కిలోమీటర్ల విస్తీర్ణంలో కొత్త రైల్వేలైన్ల ఏర్పాటు కోసం 26 ప్రాజెక్టులకు (మిగతా 8వ పేజీలో..)

భూములు కోల్పోతున్న రైతులు..

జాతీయ రహదారులు, ఆయిల్ కార్పొరేషన్లు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుల కోసం ఇప్పటికే కొత్తవలస మండలంలో వేలాది ఎకరాల భూములను రైతుల నుంచి అధికారులు సేకరించారు. ఇప్పుడు కొత్త రైల్వే లైన్ల కోసం మళ్లీ భూసేకరణ చేపట్టనుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు భూములను ఉంచరా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే కొత్తవలస నుంచి విజయనగరం వరకు 34.7 కిలోమీటర్లు పొడవున నాలుగో రైల్వే లైన్‌కోసం రైల్వేశాఖ సుమారు 218 ఎకరాల భూములను సేకరించారు. తాజాగా ఏర్పాటు చేయనున్న రైల్వే బైపాస్ లైన్ కోసం కొత్తవలస మండలంతో పాటు అనకాపల్లి జిల్లా కె.కోటపాడు, సబ్బవరం మండలాల్లో వందలాది ఎకరాలను సేకరించాల్సి ఉంటుంది. అదే విధంగా గోపాలపట్నం నుంచి కొత్తవలస వరకు ఐదు, ఆరు లైన్‌లు ఏర్పాటు చేస్తే పెందుర్తి, కొత్తవలస మండలాల్లోని భూములను రైతులు కోల్పోవల్సి ఉంటుంది. ఇప్పటికే వివిధ ప్రాజెక్టుల కోసం తమ భూములను కోల్పోయామని, ఇప్పుడు రైల్వేలైన్ల కోసం మిగిలిన భూములను కూడా తీసుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రాజెక్టు వచ్చి భూసేకరణ చేస్తారోనని భయంతో, తమ భూములను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని అంటున్నారు.

శరన్నవరాత్రి
పూజలకు వేళాయే

- ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహణ
- ముస్తాబవుతున్న ఆలయాలు



విజయనగనరం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లావాసులు సిద్ధమవుతున్నారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు దేవీ శరన్నవరాత్రులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దుర్గా పూజలకు మండపాలు సిద్ధం చేస్తున్నారు. తొమ్మిదిరోజుల పాటు కుంకుమార్చనలు, హోమాలు, సామూహిక రుద్రాభిషేకాలు, దీపోత్సవాలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. రోజుకో అవతారంలో దుర్గమ్మ తల్లి భక్తులకు దర్శనమివ్వనున్నారు. విజయనగరం పాతబస్టాండ్, బాబామెట్టలోని దుర్గాదేవి ఆలయాలతో పాటు పైడిమాంబ, కన్యకాపరమేశ్వరీ, జ్ఞానసరస్వతి ఆలయాల్లో దసరా ఉత్సవాలు జరగనున్నాయి. విజయనగరం న్యూపూర్ణజంక్షన్, కొత్తపేట యాదవ వీధి, కొణిశివీధి, బాబామెట్ట, దాసన్నపేట, కర్రల మార్కెట్, వీటిఅగ్రహారం, కేఎల్‌పురం తదితర ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వహకులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

- రాజాం పట్టణానికి చెందిన పైడితల్లి అనే వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడు. శరీరంలో రక్తం శాతం తగ్గడమే దీనికి కారణమని వైద్యులు నిర్ధారించారు. మూడు యూనిట్లు అవసరమని గుర్తించారు. పైడితల్లి కుటుంబ సభ్యులు ప్రైవేటు రక్తనిధి కేంద్రానికి వెళ్లగా రూ.1500అని చెప్పారు. మరో కేంద్రానికి వెళితే రూ.1000 అని చెప్పడంతో తీసుకున్నారు. మరుసటి రోజు మరో ప్యాకెట్‌కి వెళితే రూ.1200 తీసుకున్నారు. మూడో రోజు డోనర్ కార్డు పట్టుకుని వేరే బ్లడ్ బ్యాంకు వెళితే రూ.800 తీసుకున్నారు.



రక్తంతో వ్యాపారమా?

- కొన్ని ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల ఇష్టారాజ్యం
- సేవ ముసుగులో దందా
- పాటించని నిబంధనలు
- కానరాని అధికారుల తనిఖీలు

రాజాం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇది ఒక పైడితల్లి పరిస్థితే కాదు. జిల్లా వ్యాప్తంగా ఇదే జరుగుతోంది. జిల్లాలో అవసరానికి తగ్గట్టు రక్తసేకరణ జరగడం లేదు. రక్తదాతలు ముందుకు రావడం లేదు. సేవ ముసుగలో రక్తనిధి కేంద్రాలు వ్యాపార మార్గాలుగా మారిపోయాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఔషధ నియంత్రణ అధికారుల తనిఖీలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా రక్తాన్ని విక్రయిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 9 రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలు కేవలం రెండు మాత్రమే. చీపురుపల్లిలో రూ.80 లక్షలతో భవన నిర్మాణం పూర్తయినా కేంద్రం సేవలను మాత్రం ప్రారంభించలేదు. ప్రైవేట్ రక్తనిధి కేంద్రాలు ఏడు వరకు ఉండగా, రక్తాన్ని నిల్వ చేసే కేంద్రాలు 11 వరకూ కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలతో పాటు డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎక్కువ మందిలో ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. ఈ క్రమంలో రక్తం అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో అండగా నిలవాల్సిన బ్లడ్ బ్యాంక్‌లు అవసరానికి దోపిడీకి పాల్పడుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

కానరాని నిబంధనలు..

బ్లడ్ బ్యాంకులు నిబంధనలు పక్కాగా పాటించాలి. అందుబాటులో ఉన్న రక్తం, గ్రూపులు, ధరలు, సంప్రదించాల్సిన నెంబర్లను బోర్డులో రాసి ఉంచాలి. సంబంధిత వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలి. రక్తం ప్యాకెట్లకు ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే వసూలు చేయాలి. తాజా మార్గదర్శకాల ప్రకారం రక్తం లేదా రక్త విభాగాలకు రూ.250 నుంచి రూ.1550 వరకూ మాత్రమే వసూలు చేయాలి. ఈ మేరకు రాష్ట్ర ఔషధ నియంత్రణ అధికారులకు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) ఆదేశించింది. కానీ, జిల్లాలో చాలా బ్లడ్ బ్యాంకులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా కృత్రిమ కొరత సృష్టించి అధికంగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం

జిల్లాలో అవసరానికి తగ్గట్టు రక్తసేకరణ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. రెడ్‌క్రాస్ రక్తదానం విషయంలో విస్తృత అవగాహన చేపడుతోంది. అవగాహన ఉన్నవారు మాత్రమే దానం చేస్తున్నారు. కొత్తవారు రావడం లేదు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు పోవాలి. ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలు కృషిచేయాలి.

-ప్రసాదరావు, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్, విజయనగరం

అధికంగా కొరత..

జిల్లాలో రక్తం కొరత అధికంగా ఉంది. అవసరానికి తగ్గట్టు దాతలు ముందుకు రాకపోవడం ఆందోళన (మిగతా 8వ పేజీలో..)

రైతులకు రూ.3కోట్ల టోకరా

- పంటను కొనుగోలు చేసి డబ్బులు చెల్లించని వైనం
- కంపెనీ ప్రతినిధులకు నిలదీత
- ఇరువర్గాల మధ్య కొట్లాట



రెల్లివలస కొండగుడ్డిలో దళారులు, రైతుల మధ్య గొడవ

పూసపాటిరేగ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ కంపెనీ మొక్కజొన్న రైతులకు రూ.3కోట్ల వరకు టోకరా పెట్టిన ఘటన మండలంలో వెలుగుచూసింది. గతేడాది ఓ కంపెనీకి చెందిన ప్రతినిధులు వివిధ గ్రామాలకు వెళ్లి 'మేమే మొక్కజొన్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇస్తాం. పంటను సాగు చేయండి. అధిక ధరకు కొనుగోలు చేస్తాం' అని ప్రచారం చేశారు. దీనికోసం కొంతమంది దళారులను కంపెనీ నియమించుకుంది. వారి మాటలను నమ్మిన పలు గ్రామాల రైతులు తమ పొలాల్లో ఆ కంపెనీ ఇచ్చిన విత్తనాలు నాటి మొక్కజొన్నను సాగు చేశారు. ఈ పంటను తీసుకున్న సదరు కంపెనీ రైతులకు మాత్రం రూపాయి కూడా ఇవ్వలేదు. కంపెనీ ప్రతినిధులు, దళారులను అడుగుతున్నా ఇదుగో, అదుగో అంటూ కాలయాపన చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. సుమారు రూ.3కోట్ల వరకు ఆ కంపెనీ నుంచి రైతులకు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రెల్లివలస కొండగుడ్డి వద్ద ఆ కంపెనీ వ్యక్తులు, దళారీలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ విషయం గతంలో మోసపోయిన రైతులకు తెలిసింది. దీంతో వారంతా రెల్లివలస వెళ్లి పంట డబ్బులు ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులను నిలదీశారు. దళారులను అడగండంటూ వారు చెప్పడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకొంది. దీంతో వారితో గొడవకు దిగారు. ఇది కొట్లాటకు దారితీసింది. తమను మోసం చేసిన వారిపై వ్యవశాయశాఖకు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు. జిల్లా వ్యవశాయశాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నేలకు ఆరోగ్యం..
రైతులకు మేలు
- జీవన ఎరువులు, ప్రకృతి విధానం ఎంతో ఉపయోగం
- రసాయన ఎరువులతో మట్టి సారం కోల్పోతున్న వైనం
6లో

వినతులను పరిష్కరించాలి
- ఉద్యోగుల నుంచి 40 అర్జీలు స్వీకరించిన కలెక్టర్
6లో

రామతీర్థంలో ముగిసిన పవిత్రోత్సవాలు
6లో





మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడి

విజయనగరం ఉత్సవాలకు సన్నద్ధం

విజయనగరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. ఉత్సవ ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. గత ఏడాది ఏయే కార్యక్రమాలు నిర్వహించారు? ఎంత మొత్తం నిధులు వ్యయం చేశారు వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నిధులు లభ్యతను బట్టి ఈ ఏడాది ఉత్సవాలు నిర్వహించడానికి యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. క్రీడలు, సంగీత, సాంస్కృతిక, సైన్స్‌ఫెర్, కవి సమ్మేళనం, జానపద కళాప్రదర్శనలు, నాటికలు, నాటకాలు, పుష్ప ప్రదర్శన తదితర కార్యక్రమాలు యథావిధిగా నిర్వహించాలన్నారు. ఉత్సవ జీవిత కాలసభ్యులను కూడా ఆహ్వానించి కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, వ్యవసాయశాఖ ఇన్‌చార్జి జేడీ భారతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి
- అసెంబ్లీలో గళమెత్తిన జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు
6లో

నిరుపేదలకు అండగా..

- ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎంఆర్ఎఫ్
- జిల్లాలో ఎంతోమందికి లబ్ధి

- శృంగవరపుకోట మండలం తిమిడి గ్రామానికి చెందిన బేతా వెంకటరమణ, మంగమ్మ కుమారుడు వెంకట శివప్రసాద్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విశాఖపట్నంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో శివప్రసాద్‌ను చేర్పించగా కిడ్నీ, లివర్ పాడవుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్సకు రూ.2.42 లక్షలు ఖర్చయింది. పేద కుటుంబ కావడంతో అప్పు చేసి ఆ డబ్బు తెచ్చారు. పీఏసీఎస్ ఛైర్మన్ జీఎస్ నాయుడు సహకారంతో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని ఆ కుటుంబం కలిసింది. సీఎం సహాయ నిధి ద్వారా ఆ కుటుంబానికి రూ.99,261 అందించి ఆదుకున్నారు.
- వేపాడ మండలం అరిగిపాలెం గ్రామానికి చెందిన రాము అనే మహిళ కూలీనాలి చేసుకుని బతుకుతుంది. భర్త చాలా కాలం కిందట చనిపోయాడు. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శస్త్ర చికిత్స అవసరం కావడంతో అప్పు చేసి రూ.3.79లక్షలు ఆస్పత్రికి చెల్లించారు. గ్రామ నాయకుడు దుల్ల వెంకటరావుతో కలిపి ఎమ్మెల్యే లలిత కుమారిని ఆ కుటుంబం కలిసింది. సీఎం సహాయ నిధి ద్వారా వారికి రూ.1.31 లక్షలు ఇప్పించారు. ఈ డబ్బుతో సగం అప్పు తిరిగి చెల్లించారు.



శృంగవరపుకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదల పాలిట వరంగా మారింది. వారికి ఆర్థికంగా అండగా నిలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 600 నుంచి 800 పేద కుటుంబాలు కోట్ల రూపాయలు లబ్ధిపొందినట్లు అంచనా. ఒక్క శృంగవరపుకోట నియోజకవర్గంలోనే 159 పేద కుటుంబాలు రూ.1.50 కోట్ల సీఎం ఆర్ఎఫ్‌ను అందుకున్నాయి. ఇదేవిధంగా ప్రతి నియోజకవర్గంలోనూ రూ.కోటి నుంచి రూ.2కోట్ల వరకు శాసనసభ్యులు సీఎంఆర్ఎఫ్ నుంచి రాబట్టారు. ప్రస్తుతం వైద్యం ఖరీదైంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెద్ద పెద్ద జబ్బులు నయమవుతాయన్న నమ్మకం ప్రజల్లో లేదు. అనారోగ్యం నుంచి బయటపడాలంటే ప్రైవేటు, కార్పొరేట్ వైద్యం పొందక తప్పదన్న నిర్ణయానికి వచ్చేశారు. దీంతో పేద, ధనిక అనే తేడా లేకుండా కొన్ని వ్యాధులను నయం చేసుకునేందుకు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ కొన్ని వ్యాధులకు అందులో చోటు లేదు. ఒక వేళ ఉన్నప్పటికీ దీని ద్వారా వచ్చే సొమ్ము సరిపోవడం లేదు. అదనంగా రూ.లక్షల్లో ఖర్చవుతుంది. దీంతో అప్పు చేయాల్సి వస్తుంది. ఇంత అప్పు చేసి వైద్యం చేయించినప్పటికీ ప్రాణాలు దక్కని వారున్నారు. కుటుంబ పెద్ద కనుమరుగు అవడంతో పని చేసేవారు లేక, అప్పు ఎలా తీర్చాలో అర్థం కాక అనేక పేద కుటుంబాలు సతమతమవుతున్నాయి. అలాగే, ఆరోగ్యం బాగుపడిన (మిగతా 8వ పేజీలో..)

నేలకు ఆరోగ్యం.. రైతుకు మేలు



- జీవన ఎరువులు, ప్రకృతి విధానం ఎంతో ఉపయోగం
- రసాయన ఎరువులతో మట్టి సారం కోల్పోతున్న వైనం

గంట్యాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి)

యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇంత కష్టపడి యూరియా బస్తా సంపా దించినా పంటకు జరిగిన మేలు కంటే అనర్థాలే ఎక్కువని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రసాయన ఎరువుల విని యోగంతో తెగుళ్ల పెరగడంతోపాటు ఆ విషపూరిత ఉత్పత్తులు తినడం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుందంటున్నారు. అదే ప్రకృతిసాగు, జీవన ఎరువుల వినియోగం వల్ల నేల కూడా ఆరోగ్యంగా ఉంటుంది. వీటిపై రైతుల్లో చైతన్యం పెరగాల్సిన అవసరముందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. యూరియాతోపాటు మిగిలిన రసాయన ఎరువుల వాడకం వల్ల మట్టిసారం కోల్పోతోందని శాస్త్రవేత్తల అధ్యయనంలో గుర్తించారు.

యూరియా వల్ల భూమి నిస్సారమై..

సాధారణ యూరియా 45 కేజీలు బస్తా 267 రూపాయలకు సబ్సిడీతో ప్రభుత్వ అందజేస్తోంది. వీటికి రవాణా ఖర్చులు అదనం. ఎకరాకు రెండు నుంచి నాలుగు బస్తాలు అవసరం. 35 శాతం నత్రజని మాత్రమే పంటకు అందు తుంది. మిగిలినది ఆవిరై పోతుంది. దీని పనితనం రెండు రోజులు ఉంటుంది. వేర్ల నుంచి ఆకులకు పంటపై భాగాల కు నత్రజని తక్కువగా చేరుతుంది. రెండు మూడు నెలలు తర్వాత గడ్డ కట్టే అవకాశం ఎక్కు వ. ఎరువుల కంపెనీల్లో యూరియా ఉత్పత్తికి అంతరాయం కలిగితే కొరత ఏర్పడుతుంది. ప్రతి యూరియా బస్తాకు రూ.1970 కంపెనీకి రాయితీ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోంది.

- యూరియాను అవసరానికి మించి వాడితే భూమినిస్సా రం అవుతుంది. మొక్కలు పెలుసు బారి చీడపీడలు పెరుగుతాయి.



- నెలలో ఉండే పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు తగ్గిపోతాయి.
- యూరి యా ఆమ్లస్వభా వం కలిగి ఉంటు ంది. దీంతో భూ మి ఆమ్లనేలలగా మారుతాయి.
- యూరి యా వేసిన తర్వాత పంటలకు 30నుంచి 35 శాతం వరకే మొక్కలకు అందుతుంది. మిగతాది గాలిలోకి ఆవిరి రూపంలో భూపోర, భూగర్భజలాల్లో కలిసి పోతుంది.

దిగుబడి పెరిగి.. ఖర్చు తగ్గి

వేరుశనగ పిండి, వేప పిండి, ఆముదం పిండి, చెరకు మడ్డి, వర్మీ కంపోస్టు జీవన ఎరువులు కిందకు వస్తాయి. గాలిలో నత్రజని 78 శాతం ఉంది. అంటే యూరియాలో ఉండే నత్రజని కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ. ఈ నత్రజనిని మొక్కలు తమంత తాము వినియోగించుకోలేవు. కొన్ని సూక్ష్మజీవులు, నాచు రకాలు గాలిలో నత్రజనిని గ్రహించి మొక్కలకు అందజేస్తాయి. నేలలో ఉండి కూడా మొక్కలకు లభ్యం కాని విధంగా భాస్వరం లభిస్తుంది. దీన్ని మొక్కలకు అందే లా చేయడానికి కొన్ని సూక్ష్మజీవులు, శిలీంద్రాలు ఉన్నాయి. జీవన ఎరువులు వినియోగం వల్ల భూమి భౌతిక స్వరూ పం అభివృద్ధి చెందుతుంది. భూమిలో నిల్వచేసే గుణం ఎక్కువగా ఉంటుంది. జీవన ఎరువులు రెండు రకాలు. ఒక టి నత్రజని నిల్వ చేసేవి, రెండోది భాస్వరాన్ని కరిగించేవి.

- ఇవి ప్రకృతిలో ఉన్న నత్రజని, భాస్వరాన్ని గ్రహించి మొక్కలకు అందజేస్తాయి. మొక్క పెరుగుదలకు అవసర మైన హార్మోనులు, విటమిన్లు, ఎంజైములు ఇస్తాయి. 20 నుంచి 25శాతం వరకూ నత్రజని, భాస్వరం ఎరువులు తగ్గించవచ్చు. 10 నుంచి 20 శాతం దిగుబడులు పెరుగు తాయి. భూసారం పెరుగుతుంది. నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను, వాతావరణ కాలుష్యం నివారించవచ్చు. దిగుబడుల్లో నాణ్యత, రుచి పెరుగుతుంది.
- యూరియాలో 90శాతానికి పైగా నత్రజని ఉం టుంది. దీనికి ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో లభించే జీవన ఎరువులు వినియోగించవచ్చని వ్యవసాయ నిపుణు లు, అధికారులు చెబుతున్నారు. రైజోబియం, అజతోబాక్టర్, అజస్పైరిల్లం, అజోలా, నీటి ఆకుపచ్చ నాచు వంటి జీవన ఎరువులు వినియోగించడం ద్వారా భూమి సహజ స్వభా వం దెబ్బతినకుండా నత్రజని శాతాన్ని పెంచవచ్చు. భాస్వ రం, పొటాష్‌కు బదులు ప్రకృతి సాగు విధానంలో ఘన జీ వనామృతం, ద్రవజీవామృతం వినియోగించుకోవచ్చు. వీటిని ఆవుపేడ, ఆవు మూత్రంతో తయారు చేస్తారు. ఈ విధానాన్ని జిల్లాలో కొందరు రైతులు ఆచరిస్తున్నారు. వీటి తో పాటు పలు రకాల ఆకుల కషాయాలను పంటలపై పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించుకోవచ్చని చెబుతున్నారు.

ప్రకృతిసాగుపై అవగాహన కల్పించాలి..

జిల్లాలో ప్రకృతి సాగు విధానంపై రైతులకు అవగాహ న కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం జిల్లాలో ఓ శాఖ ఉంది. ప్రతి మండలానికి ప్రకృతి వ్యవసాయ సిబ్బ ంది కూడా ఉన్నారు. వీరు రైతులను చైతన్యపర్చి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంలో ఈ శాఖ చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉంది. కానీ కొన్నిచోట్ల శిక్షణ ఇస్తున్నా రైతులే ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

జీవన ఎరువులపై అవగాహన పెంచుతున్నాం..



జీవన ఎరువులు వినియోగించడం వల్ల రైతులుకు చాలా ఉపయోగం ఉంది. దీనిపై రైతుల్లో అవగాహన పెంచుతున్నాం. జీవన ఎరువులు మండలంలోని అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడిప్పుడే కొంతమంది రైతులు జీవన ఎరువులు వినియోగిస్తున్నారు. ఈ ఎరువులు వినియోగిచడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుంది. మరోవైపు ప్రజలకు ఆరోగ్య కరమైన ఆహారోత్పత్తులు అందుతాయి. ఈ దిశగా రైతులు ముందుకు రావలి.

-శ్యామ్‌కుమార్, ఏవో, గంట్యాడ

సమస్యలు పరిష్కరించండి

- అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యేలు

శాసనసభ సమావేశాల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలు సమస్యలపై గళం వినిపించారు. శుక్రవారం ఆయా నియోజకవర్గాల పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. జిల్లాలో సమస్యలు పరిష్కరించాలని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత మంత్రులను కోరారు.

పశుసంవర్ధకశాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

- బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



బొబ్బిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో ఖాళీలను భర్తీ చేయా లని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్ కేకే రంగారావు (బేబీనాయన) కోరారు. శుక్రవారం శాసనసభ లో పాడి రైతులు సమస్యలు, పశు వైద్యశాలలపై ప్రస్తావించారు. దేశవాళి పశువుల స్థానంలో సంకరజాతి పశువులు రావడంతో అనేక వ్యాధులు సంక్రమిస్తున్నాయని, అధిక పాలదిగుబడిని సాధించాలన్న తపనతో పాడి రైతులు అవాంఛనీయమైన పద్ధతులను పాటించడం వల్ల పాడిపశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని తెలిపారు. పశువులు, ఇతర జంతుజాలానికి వైద్యం అందించేందుకు అవసరమైన ఆసుపత్రులు, క్లినిక్‌లు ఉన్నా సరిపడా సిబ్బంది లేకపోవడంతో రైతులు అవ స్థలుపడుతున్నారని చెప్పారు. తన నియోజకవర్గం పరిధిలో రామభద్రపురం మండలంలోని కొట్టక్కి, బాడంగి మండలంలోని వాడాడ పశువుల ఆస్ప త్రుల్లో వైద్యులు లేరని తెలిపారు. పశువైద్యులు, ఉద్యోగుల జీతభత్యాలు పెంచాలని కోరారు. తెర్లాం మండలంలోని నెమలాం, బొబ్బిలి మండలంలోని పక్కి, రామభద్రపురం, రొంపల్లిలో పశువుల ఆసు పత్రి భవనాలు శిథిలావస్థకు చేరాయని సభలో ప్రస్తావించారు. పట్టణ ప్రాంతాల్లో ఫార్మర్స్ సర్వీసు సెంటర్లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని, పాడి సంపదను పెంచుకునేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బేబీనాయన లేవనెత్తిన అంశాలకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు.

తోటపల్లి పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



రాజాం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి పెండింగ్ పనులు పూర్తిచేసి ఐదు నియోజకవర్గాలకు సాగునీరందించేలా చర్య లు తీసుకోవాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. శాసనసభలో మాట్లా డుతూ 2014-19లో సాగునీటి ప్రాజెక్టుల కోసం ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.1376 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. రాజాం నియోజకవర్గంలో మడ్డువలస ప్రాజెక్టు ఫేజ్-1 పూర్తయ్యిందని, ఫేజ్-2 కింద ఎచ్చెర్ల, పొందూరు, జి.సిగడాం మండలాల్లో సాగునీరందిం చేందుకు పనులు పూర్తికావాల్సిఉందని తెలిపారు. ప్రధాన కాలువ పూర్తి కాలేదని చెప్పారు. ఇంజనీర్లు ఉన్నా లస్కర్లు పూర్తిస్థాయిలో లేరన్నారు. రాజాం నియోజకవర్గంలో 26వేల ఎకరాలకు నీరివ్వాల్సి ఉందని, ఈ ఖరీఫ్ సీజన్‌లో 20వేల ఎకరాలకు మాత్రమే నీరివ్వగలుగుతున్నట్లు చెప్పారు. సంత కవిటి మండలంలో నారాయణపురం ప్రాజెక్టుకు జైకా నిధులు మంజూరైనా ఇంజనీరింగ్ అధికా రులు నిర్లక్ష్యం వల్ల పనులు పెండింగ్‌లో ఉన్నా యని తెలిపారు. సాయన్న గెడ్డ ప్రతిఏటా పొంగి రెండు వేల ఎకరాలు నష్టం వాటిల్లుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో ఇరిగేషన్ మంత్రి చొరవతో సీఎం చంద్రబాబు రూ.65 కోట్లు కేటాయించారన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను సకాలంలో పూర్తి చేయించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతులను పరిష్కరించాలి

- ఉద్యోగుల నుంచి 40 అర్జీలు స్వీకరించిన కలెక్టర్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు నుంచి అందిన వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టరు రామ సుందర్ రెడ్డి ఆదేశించారు.జిల్లా స్థాయిలో పరిష్కారం కాని వాటిని రాష్ట్ర స్థాయికి పంపించాలని కోరారు. పాలసీకి సంబంధించి వాటిని కూడా ప్రభుత్వానికి పంపించాలని తెలిపారు. ప్రతిమూడో శుక్రవారం ఉద్యోగులు కోసం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉద్యోగులు గ్రీవెన్స్ నిర్వహించారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు 40 అర్జీలు అందజేశారు. ఈ కార్య క్రమంలో జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

- రామవరం, నరవ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు హెచ్‌ఆర్‌ఏ 10 శాతం ఇస్తున్నారని, మిగిలిన వారిలాగా 16 శాతం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు సంఘం అధ్యక్షుడు వై.రమణ, ఎన్‌జీవో సంఘ వైస్ ప్రెసి డెంట్, సంఘ నాయకులు కలిసి కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.
- డుమాలో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రేడ్ ఫిక్షేసన్, పీఆర్సీ, నగదు రహిత హెల్త్ కార్డులు జారీచేయాలని వినతిపత్రం సమర్పించారు.
- తమకు నాలుగేళ్లవుతున్నా రెగ్యులర్ చేయలేదని, ఇప్పటికీ తమకు 15 వేలు జీతం ఇస్తున్నారని, సర్వీసును రెగ్యులర్ చేయాలని చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ పరిధిలో పని చేస్తున్న గ్రామ వార్డు గ్రేడ్-2 ఉద్యోగులు కోరారు.
- వీఆర్వోలు, అటెండర్, నైట్ వాచమన్‌గా పదోన్నతులు కల్పించాలని, ఉమ్మడి జిల్లా సీనియార్టీ లిస్టును పబ్లిష్ చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకులు కోరారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన కలెక్టర్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన రామసుందర్‌రెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబితను కలిశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయాధికారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

రామతీర్థంలో ముగిసిన పవిత్రోత్సవాలు

నెల్లిమర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామివారి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న స్వామివారి పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. రామచంద్ర స్వామివారికి పంచామృతా భిషేకం నిర్వహించి అర్చకులు పవిత్రధారణ చేశారు. శుక్రవారం స్వామివారికి ప్రాతఃకాల అర్చన, బాలభాగం నిర్వహించారు. అనంతరం పవిత్ర విసర్జన కార్యక్రమాన్ని చేపట్టారు. యాగశాలలో ప్రాయశ్చిత్త, సుందరకాండ హోమాలకు మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఉత్సవమూర్తుల వద్ద కల్యాణోత్సవం, పట్టాభిషేకం వేడుకలను వైదిక సిబ్బంది శాస్త్రోక్తంగా జరిపించారు. దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణ లో అర్చకులు ఖండవిల్లి సాయిరామా చార్యులు, ఖండవిల్లి కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణింగపల్లి ప్రసాద్, పవన్‌కుమార్, రాంగోపాల్ తదితరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సిరిమాను చెట్టుకు పూజలు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

గంట్యాడ సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొండతామరాపల్లిలో గుర్తించి న పైడితల్లి అమ్మవారి సిరి మాను చెట్టుకు పూజలు నిర్వ హిస్తున్నారు. ప్రతి రోజూ ఉద యం నుంచి సాయంత్రం వరకూ వివిధ గ్రామాలకు చెందిన వారితోపాటు విజయనగరం నుంచి కూడా మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి పూజులు చేసి మొక్కు లు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం టీడీపీ నాయకులు సిరిమాను చెట్టుకు పూజలు చేశారు. ఇక్కడకి వచ్చే భక్తులకు స్థానికులు అన్నదాన కార్య క్రమం నిర్వహిస్తున్నారు. అలాగే వివిధ సాం స్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- పార్వతీపురం జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త నాగభూషణరావు

జియ్యమ్మవలస, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో మహి ళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసు కుంటున్నామని పార్వతీపురం జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త (డీసీ హెచ్‌ఎస్) జి.నాగభూషణరావు తెలిపారు. శుక్రవారం చినమేరంగి సీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడు తూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మహిళల ఆరోగ్యంకోసం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. అక్టోబరు రెండో తేదీ వరకు ఆరోగ్య మేళాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్‌ఆర్‌కే చైతన్య, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగభూషణరావు



చెత్త పేరుకుపోయి.. రోడ్లపైకి నీరు చేరి

- పార్కింగ్‌కు స్థలాలు లేక జఠిలమవుతున్న ట్రాఫిక్
- సమీపిస్తున్న దసరా ఉత్సవాలు
- పాలకొండలో సమస్యలు పాగా

పాలకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి)

పాలకొండలో కోటదుర్గమ్మ దసరా నవరాత్రి ఉత్సవాలు సమీపి స్తున్నా ఏర్పాట్లు కానరావడంలేదు. అడుగుడునా సమస్యలు పాగా వేశాయి. ప్రధానంగా చెత్త నిర్వహణ లేకపోవడంతో పేరుకుపో యింది. పార్కింగ్‌కోసం స్థలాలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. దీనికితోడు పట్టణంలో తోటపల్లి ఎడమ కాలువ కు రంధ్రం పడడంతో రోడ్లపైకి నీరుచేరుతుండడంతో వాహన చోదకులు అగచాట్లకు గురవుతున్నారు.

పాలకొండలో ఏటా విజయదశమి నవరాత్రి ఉత్సవాలు ఘనం గా జరుగుతాయి. ఈ ఉత్సవాలకు వేలాది మంది భక్తులొచ్చి అమ్మవారి దర్శించుకుంటారు. ఉమ్మడి శ్రీకాకుళం, మన్యం జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న పట్టణానికి చెందిన వారంతా స్వస్థలాలకు చేరుకుంటారు. నవరాత్రి ఉత్సవాలను కుటుంబసభ్యులతో కలిపి వేడుకగా నిర్వహిస్తారు. పాలకొండలో పలు సమస్యలు తిష్టవేశాయి. వీటిని అధిగమిస్తేనే నవరాత్రి ఉత్స వాలను విజయవంతంగా జరిగే అవకాశముంటుంది. ఏటా నవ రాత్రి ఉత్సవాల సమయంలో వర్షాలు పడడం ఆనవాయితీగా వ స్తోంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంటే ప్రధానంగా పట్టణాన్ని పీడిస్తున్న పారిశుధ్య సమస్య నుంచి గట్టెక్కాల్సిఉంది. దీనికితోడు పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య అత్యంత వేధి స్తోంది. ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతోంది.

పారిశుధ్య సిబ్బంది కొరత..

స్థానిక నగర పంచాయతీలో పారిశుధ్య సమస్య పట్టి పీడి స్తోంది. చాలీచాలని పారిశుధ్య సిబ్బందితో పట్టణంలో చెత్త తొల గించడం కష్టతరంగా మారుతోంది. ఇక్కడ కేవలం 59 మంది పారిశుధ్యకార్మికులు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం రోజువారీ పను లు చేసేందుకే వారికి కష్టతరంగా మారుతోంది. చెత్త ఏరోజుకారో జు తొలగించే పరిస్థితి సాధ్యం కావడంలేదు. అటువంటిది దసరా నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి ముర్రాటలు, ఘటాలతో మొక్కులు చెల్లించేందుకు వేలాది మంది ప్రతిరోజూ ఆలయా నికి వస్తారు. ఆయా వీధుల్లో గ్రామ దేవతలకు ముర్రాట లిస్తారు. ఆ సమయంలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించ డం ప్రస్తుతం ఉన్న సిబ్బందికి తలకుమించిన భారంగా మా రే అవకాశముంది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి పారిశుధ్య కార్మికులను రప్పించాలి. లేకుంటే తాత్కాలిక ప్రాతిపదికన కార్మికులను నియమించాలి.

కాలనీల్లోకి వరద..

పాలకొండ మీదుగానే వడమ గ్రామానికి తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగు నీరందుతుంది. కాలువ నిండుగా సాగు నీరు ప్రవహించే సమయంలో పలు కాలనీల్లో వరదనీరు చొరబడ డంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు తలెత్తున్నాయి. ప్రస్తుతం ఏలాం జంక్షన్ వద్ద పది రోజులుగా అండర్ టన్నెల్‌కు రంధ్రం పడినా నీటిపారుదల శాఖ అధికారులు నియంత్రించలేదు. దీంతో ప్రధాన రహదారిపై వరదనీరు ప్రవహిస్తుండ డంతో ఆర్‌అండ్‌బీ రహదారి బురదమయంగా మారింది. ఈ విషయంలో నగర పంచాయతీ యంత్రాంగం సమన్వయం చేసుకొని వరదనీరు పట్టణంలోకి ప్రవహించకుండా చర్యలు చేపట్టాల్సిఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలొస్తున్నాయి.

మోటార్లు మొరాయించడంతో..

పట్టణంలో తాగునీటి సమస్య వేధిస్తోంది. ఈ నేపథ్యంలో తాగునీటి పథకం పనులు ముందుకు సాగడం లేదు. పట్టణంలో నాలుగు రక్షిత పథకాలు అందుబాటులో ఉన్నా తరచూ ఏదో ఒక పథకానికి సంబంధించి పైపులైన్లు లీకవ్వడం, మోటార్లు మొరా యించడంతో తాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదు. ప్రస్తు తం ఏఒక్క తాగునీటి పథకానికి సమస్య వచ్చినా ఆయా వార్డుల కు రెండు మూడు రోజుల పాటు తాగు నీరందడంలేదు.ఇదే పరిస్థితి నెలకుంటే దసరా ఉత్సవాల వేళ తాగునీటి కోసం పట్టణ ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనే పరిసితి ఉంటుందని పలువురు వాపోతున్నారు. గారమ్మకాలనీ, మురళీమోహన్‌నగర్, గాయ త్రీనగర్, ఎస్‌ఎస్‌ఎన్‌కాలనీతో పాటు పలు శివారు ప్రాంతాల కాలనీలకు తాగునీరందడం లేదు. ఆయా ప్రాంతాలకు ప్రత్యేక ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పాలకొండలో ప్రధానరహదారిలో పేరుకుపోయిన చెత్త

ట్రాఫిక్ నియంత్రణకు చొరవచూపాలి..

పాలకొండకు రోజురోజుకు ట్రాఫిక్ సమస్య జఠిలమవుతుంది. నగర పంచాయతీ యంత్రాంగం పోలీస్ యంత్రాంగంతో సమన్వ యం చేసుకొని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న అమ్మవారి ఆలయం వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిఉంది. అమ్మవారి ఆలయానికి సమీ పంలో పార్కింగ్ స్థలాలు అందుబాటులో లేవు. దీంతో వాహ నాలతో వచ్చే భక్తులు పోలీస్‌వారు ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతంలోనే పార్కింగ్ చేసేలా చర్యలు చేపట్టాల్సి వస్తోంది. దసరా నవరాత్రులు పురస్కరించుకుని కాలనీవాసులు సామూ హికంగా సంబరాలు చేస్తుంటారు. అటువంటి సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సమన్వయంతో నగరపంచాయతీ యంత్రాంగం చొరవ తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ పనులు, పిల్ల కాలువ పనులకు నిధులు విడుదల చేయాలన్నారు. అదేవిధంగా వెనుకబడిన ప్రాంతంగా ఉన్న చీపురుపల్లి పరిసరాల్లో యువత ఉపాధి కోసం పరిశ్రమల్ని నెలకొల్పాలని కోరారు. ఆర్ఈసీఎస్ పునరుద్ధరణ కోసం స్థానిక ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

దివ్యాంగ పిల్లలకు ఐడీ కార్డులు

గజపతినగరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఎస్.విమలమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక భవితకేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రానికి తీసుకువచ్చేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 చంద్రశేఖర్, యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గజపతినగరంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పావని

గజపతినగరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని సేవా పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం గజపతినగరంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని పాల్గొని, రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తౌడు, డి.దేముడు, మహేష్, భారతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

దత్తిరాజేరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు షికారుగంజి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఇటీవల మరుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో రగ్బీ క్రీడలో అండర్ 14, 17, 19 విభాగాల్లో 10 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఇతర ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

ఎస్.కోట ఆర్టీసీ డిపో తనిఖీ

శృంగవరపుకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ డిపోను జిల్లా ప్రజా రవాణాధికారి వరలక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. పార్శిల్, కొరియర్ సెక్షన్‌లను పరిశీలించారు. బస్సుల డిక్కీలను తనిఖీ చేశారు. అద్దె ప్రాతిపదికన బస్సుల డిక్కీలను ఇవ్వాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. బస్సు డిక్కీ బుకింగ్‌కు 7382923639, 9189676718, 9390014316 నెంబర్‌లను సంప్రదించాలని ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు తెలిపారు. డిపో మేనేజర్ సుదర్శన్ ఉన్నారు.

యూరియా పంపిణీ సక్రమంగా నిర్వహించాలి



తనిఖీలు నిర్వహిస్తున్న మండల ప్రత్యేక అధికారి శారదాదేవి

సంతకవిటి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలకు వస్తున్న యూరియాను సజావుగా పంపిణీ చేయాలని మండల ప్రత్యేక అధికారి కె.శారదాదేవి.. వ్యవసాయ అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా మండలంలోని గోళ్లవలస, జావాం, మద్దూరుశంకరపేట గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన యూరియా పంపిణీని పరిశీలించారు. అనంతరం సంతకవిటి ఎంపీడీవో కార్యలయంలో వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. మండలంలో యూరియా పంపిణీపై సిబ్బందికి సూచనలు చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శనరావు, ఏవో సీబీ యశ్వంతరావు, ఏపీవో ఆర్.హరినాథ్ పాల్గొన్నారు.

ప్రారంభించేదెప్పుడో?



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం

- నిర్మాణం పూర్తయినా ఇరుకు భవనంలోనే అవస్థలు
- ఇదీ చెరుకుపల్లి సచివాలయం పరిస్థితి

కొద్దిరోజుల్లో ప్రారంభిస్తాం

సచివాలయం నిర్మాణం పూర్తి అయింది. మరి కొద్ది రోజుల్లో ప్రారంభించేలా చర్యలు చేపడతాం.
- గాయత్రి, ఇన్‌చార్జి ఎంపీడీవో

భోగాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి గ్రామంలో నిర్మించిన సచివాలయం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఒక్కడ సచివాలయాన్ని ప్రస్తుతం ఒక ఇరుకు గదిలో నిర్వహిస్తున్నారు. ఇందులో కంప్యూటర్లు తదితర వస్తువులు ఏర్పాటు చేసుకోవడానికి ఇబ్బందికరంగా ఉంది. సచివాలయ సిబ్బంది అందరూ ఉండే సమయంలో గదులు చాలకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సమీపంలో సుమారు ఐదు నెలలు కిందట నిర్మాణం పూర్తి చేసిన సచివాలయ భవనం ప్రారంభానికి నోచుకోవడంలేదు. అధికారులు స్పందించి సచివాలయ నూతన భవనం ప్రారం భించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని అందరి కృషితో విజయవంతంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 7.30 గంటలకు నటరాజ్ కాలనీ, సింహాద్రి పార్కులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ పార్కులో పెద్దఎత్తున మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అలాగే పెరటి మొక్కలు, మిద్దె పంటల ఆవశ్యకత విస్తృతపరిచే విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకు రానున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డా.కొండపల్లి సాంబమూర్తి, ఈఈ ప్రసాద్, టీపీఆర్‌వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజరు సన్యాసిరావు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకు ప్రారంభం

నెల్లిమర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, మహేశ్వరి దంపతులు సొంత నిధులతో నెల్లిమర్ల నగర పంచాయతీ 9వ వార్డు ఇందిరాకాలనీలో వాటర్‌ట్యాంకు, కొళాయిలను నిర్మించారు. ఈ ట్యాంకును బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ శుక్రవారం ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి పతివాడ రాజేష్, బూర్లె శ్రీధర్, నెల్లిమర్ల మండల ప్రధాన కార్యదర్శి చందక గోవింద, జిల్లా ఉపాధ్యక్షురాలు దోమ కామేశ్వరి, నారాయణమూర్తి పాల్గొన్నారు.

క్రషర్‌ను నిలుపుదల చేయాలి



నిరసన చేస్తున్న మహిళలు

జామి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జామి మాధవరాయ మెట్ట వద్ద తమ నివాసాలను ఆనుకుని ఉన్న క్రషర్ నిర్వహణను వెంటనే నిలుపుదల చేయాలని స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ క్రషర్ కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ క్రషర్‌పై గతంలో ఎన్నో ఫిర్యాదులు చేసినా ఏ అధికారి పట్టించుకోలేదని, దీనివల్ల అనారోగ్యానికి గురవుతున్నామని చెప్పారు. క్రషర్ యాజమాన్యానికి అన్ని శాఖలు కొమ్ము కాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వీరజనార్ధన్ సిబ్బందితో చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు.

విద్యార్థికి పాము కాటు

రేగిడి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తునివాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి ఎ.గణేష్‌కు శుక్రవారం ఓ పాము కాటు వేసింది. పాఠశాల ప్రాంగణంలో గణేష్‌కు పాము కాటు వేయడంతో హెచ్ఎం గోవిందరావు అప్రమత్తమై రాజాం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎంఈవో వరప్రసాదరావు ఆసుపత్రికి వెళ్లి, బాధిత విద్యార్థిని పరామర్శించారు. ఈయన పరిస్థితి నిలకడగా ఉందని, ప్రమాదం లేదని తెలిపారు.

హమాలీలకు సమగ్ర చట్టం చేయాలి

రాజాం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ, కళాసీ కార్మికులకు ఉపాధితో కూడి న సమగ్రచట్టం చేయాలని రాజాం కళాసీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు కోరారు. రాజాంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని, కళాసీలకు ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేశారు.

పైడిమాంబ కల్యాణ మండపం మరమ్మతులకు ప్రతిపాదనలు

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని పైడిమాంబ కల్యాణ మండపానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ సహాయ కమిషనర్, పైడిమాంబ ఆలయ ఇన్‌చార్జి ఈవో కె.శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం పైడిమాంబ కల్యాణ మండపంపై ఆంధ్రజ్యోతిలో 'నాడు నిత్య తోరణం' శీర్షికతో కథనం వెలువ డింది. దీనిపై సహాయ కమిషనర్ వివరణ ఇచ్చారు. ఈ కల్యాణ మండపం నిర్మాణం జరిగి దాదాపు 35 ఏళ్లు పూర్తయిన కారణంగా భవనం శిథిలమైందని, పెచ్చు లూడి కింద పడుతున్నాయని వర్షాకాల సమయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా కల్యాణ మండపం త్వరితగతిన పరిశీలించి, మరమ్మతులు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి, అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కోరినట్టు ఆమె పేర్కొన్నారు.

క్రమబద్ధీకరణ చేసుకుంటే ప్రోత్సాహకాలు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఅవుట్లలో క్రమబద్ధీకరణ చేసుకుంటే మంచి ప్రోత్సాహకాలు అందిస్తున్నదని ఎల్‌టీపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఐ.ఆదినారాయణ, అల్తి శ్రీనివాసరావులు తెలిపారు. శుక్రవారం ఒక ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటుచేసిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడం వల్ల చట్టబద్ధమైన భవన నిర్మాణ అనుమతులు ఇస్తారని చెప్పారు. విద్యుత్, నీటి సరఫరా, డ్రైనేజీ, సీసరేజీ వంటి మౌలిక వసతులు కల్పిస్తారని తెలిపారు. భవిష్యత్తులో న్యాయబద్ధమైన లావాదేవీలు, సులభమైన రిజిస్ట్రేషన్లు, భవన నిర్మాణానికి బ్యాంకు రుణాలు మంజూరు అవుతాయన్నారు. ఓపెన్ స్పేస్ చార్జీలు 14 శాతం బదులు 7 శాతమే ఉంటాయన్నారు. 45 రోజుల నుంచి 90 రోజుల్లోపు దరఖాస్తుదారుడు రుసుం చెల్లిస్తే 10 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. క్రమబద్ధీకరణ చేయకపోతే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వరని.. బ్యాంకు రుణాలు మంజూరు కావని, అనుమతులు లేని ప్లాట్‌లపై అమ్మకాలు, లావాదేవీలు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు

గరివిడి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ మొక్కలను శాత శాతం రాయితీపై ఉచితంగా అందజేస్తామని చీపురుపల్లి ఉద్యాన శాఖాధికారి ఎం.అనూష తెలిపారు. శుక్రవారం అర్థమూరు గ్రామంలో ఆమె ఆయిల్‌పామ్ పంటపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక హెక్టారు ఆయిల్‌పామ్ సాగుకు గరిష్ఠంగా రూ.29వేలు సబ్సిడీ ఉందని, అంతర పంటలు, పంట నిర్వహణ కోసం ఒక హెక్టారుకు ప్రతి సంవత్సరం రూ.11,500 వరకు మొదటి నాలుగు సంవత్సరాలు సబ్సిడీ ఉందని తెలిపారు. అనంతరం లక్ష్మీ బాలాజీ ఆయిల్‌పామ్ కంపెనీ మేనేజర్ మాట్లాడుతూ పాల్తేరు ప్రాంతంలో గెలల సేకరణ కేంద్రం ఉండడం వల్ల రానున్న రోజుల్లో ఇక్కడ ఆయిల్‌పామ్ సాగు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. సర్పంచ్ కుమార్, మాజీ సర్పంచ్ రమణమూర్తి, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం తగదు



మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ నాయకుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం తగదని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం స్థానిక లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, మాజీ ముఖ్యమంత్రిగా పార్లమెంటరీ ప్రొసీజర్ పట్ల అనుభవం ఉన్న వైఎస్ జగన్ తన స్వార్థ రాజకీయాలకు మిగిలిన 10 మంది శాసనసభ్యులకు నియోజకవర్గ ప్రజల ముందు దోషులను చేయడం సబబు కాదన్నారు. అరకు, పాడేరు వంటి గిరిజన ప్రాంతాల నుంచి తొలిసారిగా, ప్రజాప్రతినిధులుగా అసెంబ్లీలోకి అడుగుపెట్టకుండా వైఎస్ జగన్ ప్రజలకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా శాసనసభకు హాజరు కావాలని, లేనిపక్షంలో రాజీనామా చేసి, కొత్తవారికి అవకాశం ఇస్తే బాగుంటుందని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నాగభూషణం, రాజారావు, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి

జామి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆ కుటుంబంలో ఉన్న మగవారు వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని లోట్లపల్లి, రామయ్యపాలెం గ్రామాల్లో శుక్రవారం అలమండ పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి పాల్గొని, మాట్లాడారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు.

మెగా ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గజపతినగరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయనగరం పట్టణానికి చెందిన తిరుమల మెడికల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి గజపతినగరం తోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 90 మంది రోగులకు హాజరయ్యారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు రాజేష్ పల్లం రాజు, అఖిలేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 60 మందికి ఈసీజీ తీశారు. సమస్యలు ఉన్నవారు తిరుమల మెడికర్ ఆసుపత్రికి రావాలని సూచించారు.

జిందాల్ అంశాన్ని చర్చించాలి

- నల్ల జెండాలతో నిర్వాసితుల నిరసన



నల్ల జెండాలు చేతపట్టి నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల సమస్యపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని వారు కోరారు. శుక్రవారం బొడ్డవర గ్రామంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో తమ నిరసనను కొనసాగించారు. నల్లజెండాలు పట్టుకుని తమకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తమ సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నేతలు కె.జోగారావు, చిప్పాడ సూరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు డీఈవో మాణిక్యంనాయుడిని కలిసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ గడువు ముగిసి, రెండేళ్లు పూర్తయినప్పటికీ, 12వ పీఆర్‌సీ కమిషన్ వేయలేదన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్‌ని అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, తక్షణమే 30శాతం ఐఆర్‌ని ప్రకటించాలని కోరారు. యూనియన్ నాయకులు లక్ష్మణ, అర్జునుడు, రాంబాబు, బంగారయ్య పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలను విడుదల చేయాలి

మెరకముడిదాం: మండలంలోని సాంతంవలస, ఉత్తరావల్లి, బుదరాయవలస జడ్పీ ఉన్నత పాఠశాలలను పీఆర్‌టీయూ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు అల్తి రాంబాబు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థికపరమైన బకాయిలను, ఐఆర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలు చెల్లించాలని, సంపాదిత సెలవులు నగదు రూపంలో వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీ అమలు చేయాలని ఆయన కోరారు. యాప్స్ భారం తొలగించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించి, డిజిటల్ ఆపరేటర్‌ను కేటాయించాలని కోరారు. పీఆర్‌టీయూ మండల యూనిట్ అధ్యక్షుడు ఆర్.సింహాద్రి, పీఆర్‌టీయూ నాయకులు ఎ.శ్రీహరిరావు, డి.కృష్ణమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



నెల్లిమర్ల: పెన్‌డౌన్ నిర్వహిస్తున్న దస్తావేజు లేఖర్లు

నెల్లిమర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2.0 విధానం వల్ల ప్రజలతో పాటు తమకు అసౌకర్యం కలుగుతుందని దస్తావేజు లేఖర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ శుక్రవారం పెన్‌డౌన్ నిర్వహించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ నెల్లిమర్ల శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. ● కొత్తవలస: కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఉన్న దస్తావేజు లేఖర్లు శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతిరోజూ సుమారు 70 రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు స్లాట్‌బుకింగ్ సౌకర్యం ఉండగా.. పెన్‌డౌన్ కారణంగా ఒక రిజిస్ట్రేషన్ మాత్రమే జరిగింది. దస్తావేజు లేఖర్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, ఆందోళన చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ చిన్నమ్మలుకు వినతిపత్రం అందజేశారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

వేపాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వేపాడకు చెందిన పూడి శంకర్(50) అనే వ్యక్తి అతిగా మద్యం తాగి శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. వల్లంపూడి పోలీసులు, కుటుంబీకులు అందించిన వివరాల మేరకు.. శంకర్ మద్యానికి బానిసై తరచూ మద్యం తాగుతుండేవాడు. గత రెండు రోజులుగా అతిగా మద్యం తాగాడు. శుక్రవారం కూడా గ్రామ సమీపంలో ఉన్న ఓ మామిడితోటలో అతిగా మద్యం తాగి అక్కడే మృతిచెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు పూడి సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుదర్శన్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

తండ్రి హత్య కేసులో కొడుకు అరెస్టు

తెర్లాం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎం.ఆర్.అగ్రహారంలో తండ్రిని హత్య చేసిన కేసులో కొడుకు నగరాపు శంకరరావును అరెస్టు చేశామని రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధారాలను సేకరించిన అనంతరం హత్య చేసినట్టు నిర్ధారించి, శంకరరావును అరెస్టు చేసి, కోర్టుకు తరలించామన్నారు. సీఐ వెంట ఎస్ఐ సాగర్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు ఉన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

సంతకవిటి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రాత్రి గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టి ఆమదాలవలస మండలం లచ్చయ్యపేట గ్రామానికి చెందిన దాసరి నీలం గాయాలపాలయ్యారు. దీనిపై ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండవకురిటి పంచాయతీ యాలాచీపేట(గొల్లపేట) గ్రామానికి చెందిన కొయ్యాన ఎర్రయ్య, ఆమదాలవలస మండలం లచ్చయ్యపేట గ్రామంలో ఉన్న తన కుమార్తెకు ఆరోగ్యం బాగోలేదని తెలిసి కుమార్తెను పరామర్శించడానికి వెళ్లారు. కుమార్తె చూసుకొని తిరిగి ప్రయాణమయ్యారు. తన అల్లుడు దాసరి నీలం తన ద్విచక్ర వాహనంపై మామ ఎర్రయ్యను దిగబెడుతుండగా మార్గ మధ్యంలో పోతలజోవపేట గ్రామ సమీపంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో దాసరి నీలంకు గాయాలయ్యాయి. వెంటనే ఆయనను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. దీనిపై కొయ్యాన ఎర్రయ్య శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మెంటాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటినవలస ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు గిరిని సస్పెండ్ చేసినట్టు డిప్యూటీ డీఈవో మోహనరావు తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉపాధ్యాయులు మద్యం తాగి పాఠశాలకు వెళ్తున్నట్టు అందిన ఫిర్యాదుపై విచారణ జరిపామన్నారు. గురువారం కుంటినవలస పాఠశాలలో హెచ్ఎం మద్యం తాగి పాఠశాలకు వచ్చి, మరో ఉపాధ్యాయుడిపై చేయిచేసుకున్న విషయం పాఠకులకు విదితమే. ఈ మేరకు విచారణ జరిపారు. హెచ్ఎంతో పాటు గణిత ఉపాధ్యాయుడు గిరి తరచూ మద్యం తాగి పాఠశాలకు వస్తున్నట్టు తెలిసిందని డిప్యూటీ డీఈవో తెలిపారు. ఈ ఇద్దరిపై ఉన్నతాధికారులకు నివేదికను పంపించామన్నారు. గిరిని సస్పెండ్ చేశామని చెప్పారు.

మహిళ మెడలో గొలుసు తెంచుకెళ్లారు

రామభద్రపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాలవలస సమీపంలో శుక్రవారం సాయంత్రం ఓ మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని యువకులు తెంచేసి పట్టుకుపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. బాడంగి మండలం గొల్లాది గ్రామానికి చెందిన వంగపండు పుష్ప స్కూటీని డ్రైవ్ చేసుకుంటూ రామభద్రపురం వైపు శుక్రవారం సాయంత్రం వస్తుండగా ఇద్దరు యువకులు బైకుపై ఆమెను వెంబడించి ఆమె మెడలోని నాలుగు తులాల పాడు తులాల బంగారు చైనును తెంచేసి పరారయ్యారు. బాధితురాలు గొల్లపల్లిలో ఆశావర్కర్‌గా పనిచేస్తోంది. ఏఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

- వైసీపీ నాయకుల నిరసన



పోలీసులను నెట్టుకుంటూ ముందుకు వెళ్తున్న వైసీపీ నాయకులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైసీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'చలో మెడికల్ కళాశాల' పేరుతో శుక్రవారం విజయనగరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేకపోయినా వైసీపీ నాయకులు పోలీసులను నెట్టుకుంటూ ముందుకు సాగారు. ఈసందర్భంగా వైసీపీ రాజాం నియోజకవర్గం సమన్వయకర్త తలే రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే, ఎట్టి పరిస్థితుల్లో సహించబోమన్నారు. వైసీపీ నాయకులు అవినాష్, సాయికుమార్, బంగారునాయుడు, కేవీ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి మరిచారు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ కళాశాలల అభివృద్ధిని పూర్తిగా మరిచారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ అన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆలోచన అని.. ప్రధాని నరేంద్రమోదీ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ.975కోట్లు అడ్వాన్స్ రూపంలో విడుదల చేశారని చెప్పారు. అయితే వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.476 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. నేడు రోడ్డెక్కి రాజకీయం చేద్దామనుకోవడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పతివాడ రాజేష్, రాజాన రమణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను పారిశుధ్య కార్మికులకు అప్పగించాలి

గంట్యాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికులు వచ్చే సమయంలో అందజేయాలని జడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ సూచించారు. మండలంలోని సిరిపురం ఐవీఆర్ఎస్ గ్రామంగా ఎంపిక కావడంతో శుక్రవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించి, చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడారు. ఇంటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని వారికి సూచించారు. అనంతరం తాగునీటి ట్యాంకును పరిశీలించారు. దీనిచుట్టూ రక్షణ ఏర్పాటు చేయాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాములమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

భోగాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహరాజపేట గ్రామంలో చెరువు ఆక్రమణకు గురవుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని మహారాజపేట గ్రామస్థులు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబరు 47లో ఉన్న చెరువు ఆక్రమణకు గురవుతుండడంతో వర్షపునీరు చెరువులోకి వెళ్లకుండా రోడ్లపైకి వచ్చేస్తుందని.. దీని కారణంగా రహదారులు మురుగు కూపాల్లా తయారవుతున్నాయని అన్నారు. దీనిపై గతంలో ఫిర్యాదులు చేసినా రెవెన్యూ స్పందించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వందనాల రమణ, గురనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాన్ని ఢీకొట్టిన లారీ

గజపతినగరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఓ లారీ అదుపు తప్పి దుకాణాన్ని ఢీకొట్టింది. విశాఖపట్నం నుంచి జైపూర్ వెళ్తున్న ఓ లారీ.. బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని, షాపును ఢీకొట్టి పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొత్తవలస మీదుగా రైల్వే బైపాస్ లైన్

(5వ పేజీ తరువాయి)

సంబంధించి రైల్వేశాఖ నివేదికను తయారు చేసింది. ఇందులో భాగంగా ఒడిశా నుంచి కొత్తవలస మీదుగా విశాఖపట్నానికి బొగ్గుతో పాటు వివిధ ఖనిజాలను రవాణా చేసే గూడ్స్ రైళ్ల ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రద్దీ పెరిగిపోవడంతో అదనంగా మరో రెండు లైన్లను ఏర్పాటు చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసింది. సింహాచలం నార్త్ స్టేషన్ నుంచి కొత్తవలస వరకు ప్రస్తుతం ఉన్న నాలుగు లైన్లకు అదనంగా ఐదు, ఆరు లైన్‌లు ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం విజయనగరం వైపు నుంచి రాజమండ్రి, కాకినాడ, విజయవాడ వంటి ప్రాంతాలకు సరుకులు రవాణా చేయాలన్నా, అటునుంచి సరుకులు రావాలన్నా విశాఖ, సింహాచలం స్టేషన్‌లు మీదుగా కొత్తవలస మీదుగా వెళ్లాల్సివస్తోంది. కొత్తవలస నుంచి నేరుగా అనకాపల్లి వరకు కొత్త లైన్ ఏర్పాటు చేస్తే రైళ్ల రద్దీ తగ్గడమే కాకుండా, నేరుగా విజయనగరం వైపు నుంచి కొత్తవలస, అనకాపల్లికి వెళ్లడానికి మార్గం సులభంగా ఉంటుందని రైల్వేశాఖ ఆలోచన చేసింది. దీని ప్రకారం కొత్తవలస నుంచి అనకాపల్లి వరకు 33 కిలోమీటర్ల రైల్వే బైపాస్ లైన్ వేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసింది. ఇందుకోసం ఇప్పటికే అధికారులు సర్వేచేశారు. భూసేకరణ చేయడమే మిగిలి ఉంది.

జిల్లాకు కర్నూలు ఉల్లి

(5వ పేజీ తరువాయి)

13 టన్నుల ఉల్లి వచ్చింది. ఇంతవరకూ ఆయా రైతు బజార్లలో రెండు రకాల ఉల్లిపాయలు విక్రయించే వారు. ప్రస్తుతం అన్ని రైతు బజార్లలో కర్నూలుకు చెందిన ఉల్లినే అందుబాటులో ఉంచారు. కిలో రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. వంద రూపాయలకు ఏడు కిలోలు ఇస్తున్నారు. దీంతో వినియోగదారులు కర్నూలు ఉల్లి సైజు చిన్నదైనప్పటికీ కొనుగోలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఉల్లి రైతుకు కూడా కొంత ఉపశమనం కలిగినట్టయింది. కర్నూలు ఉల్లిని రైతు బజార్లకు కేటాయించి విక్రయిస్తున్నట్టు మార్కెటింగ్ శాఖాధికారులు చెబుతున్నారు.

రక్తంతో వ్యాపారమా?

(5వ పేజీ తరువాయి)

కలిగిస్తోంది. వందల యూనిట్లు అవసరం కాగా.. పదుల సంఖ్యలో యూనిట్ల సేకరణే జరుగుతోంది. జిల్లాలో రెడ్‌క్రాస్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన పెంచుతున్నా ఆ స్థాయిలో రక్తదానానికి ప్రజలు ముందుకు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక వ్యక్తి రక్తదానం చేయడం ద్వారా నలుగురి ప్రాణాలు కాపాడవచ్చు. ఒక వ్యక్తి శరీరంలో 4,500 నుంచి 5,700 మిల్లీలీటర్ల మధ్య రక్తం ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్నవారు రక్తదానం చేయవచ్చు. 18 ఏళ్ల వయసు నుంచి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తే..జీవితకాలంలో దాదాపుగా 168 సార్లు రక్తదానం చేయవచ్చు అని నిపుణులు చెబుతున్నారు.

నిరుపేదలకు అండగా..

(5వ పేజీ తరువాయి)

వారిలో కొందరు కొన్నాళ్లు మంచానికే పరిమితవుతున్నారు. వారికి అవసరమయ్యే మందులు, ఆహారానికి డబ్బులు లేక అవస్థలు పడే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆసరాగా ఉంటుంది. వారి వైద్యానికయ్యే ఖర్చులో సగం, ఒక్కోసారి సగానికి పైబడి సీఎంఆర్ఎఫ్ ద్వారా వచ్చేస్తుంది. ఇది పేద కుటుంబాలు ఎంతో కొంత తేరుకునేందుకు ఉపయోగపడుతుంది.

ఇలా దరఖాస్తు చేసుకోండి..

- దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న కుటుంబాలు సీఎం సహాయ నిధికి అర్హులు. తెల్లరేషన్ కార్డు తప్పని సరి.
- చికిత్స పొందిన ఆసుపత్రి వివరాలు, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం సమర్పించాలి.
- రోగికు అందుతున్న చికిత్స, కొనసాగింపునకు అయ్యే ఖర్చు వివరాలు ఆసుపత్రి నుంచి తీసుకోవాలి
- వైద్య ఖర్చు వివరాలు, డిశ్చార్జి ధ్రువపత్రం, బిల్లులు తీసుకోవాలి.
- వీటిని ఆధార్, బ్యాంకు ఖాతాల సంఖ్యతో ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించాలి.
- దరఖాస్తులో ఉన్న వివరాలను అధికారులు పరిశీలిస్తారు.
- ఎంత సహాయం చేయాలో అక్కడే నిర్ణయం జరుగుతుంది.

తోటపల్లి ఈఈగా గన్నిరాజు

రాజాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు ఈఈగా వై.గన్నిరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇన్‌చార్జి ఈఈగా పనిచేసిన అప్పలనాయుడును బదిలీ చేయడంతో ఆయన స్థానంలో పాలకొండ డీఈఈగా పనిచేసిన గన్నిరాజుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తోటపల్లి ఈఈగా బాధ్యతలు చేపట్టారు. తోటపల్లి పెండింగ్ పనులు పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

జామి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమసింగిలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్, ఏజీ సురేష్‌కుమార్‌లు మండల వ్యవసాయాధికారి పూర్ణిమ ఆధ్వర్యంలో ఎరువుల నిల్వలు పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఎరువుల కృతిమ కొరత సృష్టిస్తే వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

లక్కవరపుకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళలకు పౌష్టికాహారంతోనే ఆరోగ్యం కలుగుతుందని అందుకు కావాల్సిన అన్ని పదార్థాలు ప్రభుత్వం అందిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం గోల్జాంలో జరిగిన స్వస్థ నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యుడు అనీల్‌కుమార్ పాల్గొన్నారు. ● శృంగవరపుకోట: శృంగవరపుకోట పంచాయతీ శివారు సీతంపేట గ్రామ రామాలయం వద్ద శుక్రవారం కొట్టాం వైద్య ఆరోగ్య సిబ్బంది స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆరోగ్యకర మైన మహిళలు, శక్తివంతమైన కుటుంబం అనే ప్రాధాన్యతను వివరించా రు. వైద్య పరీక్షలు చేశారు. మందులు అందించారు. పౌష్టికాహారం ఫుడ్ బాస్కెట్‌లను అందించారు. సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, గ్రామ పెద్దలు, వైద్యాధికారిణి మానస, ఏఎన్ఎం కృష్ణవేణి, ఎంఎల్‌హెచ్‌పీ అపూర్వ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

భోగాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో గాయత్రీ తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని.. అధికారులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

గోవులు రక్షించడం ప్రభుత్వ బాధ్యత

విజయనగరం కలెక్టరేట్ సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గోవులను రక్షించడంలో ప్రభుత్వం బాధ్యత వహించాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక గోసంరక్షణ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని కలెక్టరేట్ చుట్టుపక్కల ఆవులను చంపి వాటి మాంసం వివిధ వీధుల్లో విక్రయిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

రాజాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, జిల్లా కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండల కాంప్లెక్‌లో స్వచ్ఛతకు చోటేదీ?

● పిచ్చి మొక్కల మధ్య ప్రభుత్వ కార్యాలయాలు ● ఊరూరా శుభ్రతారాగానికే అధికారులు పరిమితం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయాల భవన సముదాయం పిచ్చిమొక్కలతో నిండి ఉంది. ఇక్కడి భవన సముదాయంలో మండల పరిషత్ కార్యాలయంతో పాటు వ్యవసాయ, వెలుగు, ఉపాధి, గృహ నిర్మాణ, విద్యావనరులు, భవిత, పంచాయితీరాజ్ శాఖలకు చెందిన కార్యాలయాలు ఉన్నాయి. అయితే ఇక్కడ ఏపుగా పెరిగిన పిచ్చిమెక్కలు వల్ల వర్షం నీరుసైతం బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అయితే అధికారులు మాత్రం నెలకోమారు శనివారం ఊరూరా స్వచ్ఛతారాగం ఆలపించడం ఆనవాయితీగా మారింది. తమ కార్యాలయాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించేందుకు ప్రాధాన్యమిస్తున్న అధికారులు తమ కార్యాలయాల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడానికి మాత్రం ఆసక్తి చూపడంలేదు. రోజూ వివిధ గ్రామాల వందలాది ప్రజలు మంలడల కాంప్లెక్స్‌కు వివిధ పనులపై వస్తుంటారు. పిచ్చిమొక్కల వల్ల వారు కార్యాలయాలకు వెళ్లేందుకు దారి వెతుక్కోవాల్సి వస్తోంది. అందులో విష పురుగులు సంచరిస్తుండటంతో వాటి మధ్య నుంచి వెళ్లడం ప్రజలకు సాహసంగా మారింది. ఇకనైనా మండల కాంప్లెక్స్ ప్రాంగణం శుభ్రతకు పాలకులు చర్యలు చేపట్టాల్సి ఉంది.



పిచ్చిమొక్కలతో మండల కాంప్లెక్స్ ఆవరణ

సందడిగా అన్నా క్యాంటీన్ వార్షికోత్సవం



సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బేబీనాయన చిత్రపటాలకు పాలభిషేకం

బొబ్బిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నా క్యాంటీన్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ కుట్ర పన్ని అన్నా క్యాంటీన్లను మూయించిదన్నారు. బేబీనాయన తన సొంత ఖర్చులతో అన్నా క్యాంటీన్‌ను నిర్వహించి ఎంతో ఆదర్శంగా నిలిచారని వారు కొనియాడారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు రౌతు రామ్మూర్తి తదితరులు అన్నా క్యాంటీన్ సిబ్బందిని సత్కరించారు. భోజనానికి వచ్చినవారందరికీ స్వీట్లు, పండ్లు, బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం ఎన్టీఆర్, చంద్రబాబు, బేబీనాయన చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అనంతరం చైర్మన్ రాంబార్కి, కమిషనరు లాలం రామలక్ష్మి, గెంబలి, రౌతు తదితరులు క్యాంటీన్‌లో భోజనాలను వడ్డించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం అధ్యక్షుడు సుంకరి సాయిరమేష్, తెలుగు మహిళా నాయకురాళ్లు, కౌన్సిలర్లు వెలగాడ హైమావతి, కింతలి శ్రీదేవి, సాలా స్వప్నదేవి, అంజనేయస్వామి ఆలయ చైర్మన్ కింతలి బంగార్రాజు, కంచి వెంకటరావు, కనక మహేశ్ పట్నాయక్, రాయపురెడ్డి భాను, తెర్లి రామ్మోహనరావు, బోను గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో 'పోషణ్ అభియాన్'



రంగరాయపురంలో..

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో జె.విజయలక్ష్మి అన్నారు. బంకురువలస, రంగరాయపురం, సీతయ్యపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జంక్ ఫుడ్స్ పెట్టడం, వారికి శారీరక శ్రమ లేకపోవడం వల్ల పిల్లల్లో ఊబకాయం పెరుగుతోందన్నారు. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రంగరాయపురంలో సూపర్‌వైజర్ పద్మ, సీతయ్యపేటలో సూపర్‌వైజర్ ప్రభావతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.సుబ్బలక్ష్మి, సర్పంచ్ ఉడమల గోవిందరావు, చొక్కాపు నారాయణరావు, అంగన్‌వాడీ సిబ్బంది రామలక్ష్మి, నారాయణమ్మ, సింహాచలం, పోలమ్మ, భారతి, సంధ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫూల్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.త్రినాథ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డబుల్ కాలనీ, కేంద్రియ విద్యాలయం, ఏడు కోవెళ్లు, బాబామెట్ట, రాజానగర్ లేఅవుట్, విజ్జీ స్టేడియం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

● భోగాపురం: మండలంలోని సవరవల్లి, ఉప్పాడపేట, రావాడ, బసవపాలెం, తూడెం, కవులవాడ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని విద్యుతు శాఖ ఏఈ మస్తాన్‌వల్లి శుక్రవారం తెలిపారు. దీనికి వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

● డెంకాడ: మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించడంతోపాటు సాంకేతి పనుల నిమిత్తం మండలంలోని గొలగాం, మన్యం, గంట్లాం ఎస్సీ కాలనీ, డి.తాళ్లవలస గ్రామాల్లో విద్యుత్‌ను ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్టు ఆయన చెప్పారు.

● దత్తిరాజేరు: మండలంలోని 11కేవీ గోభ్యాం ఫీడర్‌పై గోభ్యాం నుంచి పెదకాద వరకు (గోభ్యాం, మజ్జిపేట, పెదకా), 11కేవీ చౌదంతివలస ఫీడర్‌పై కె.కృష్ణాపురం నుంచి మర్రివలస(కె.కృష్ణాపురం, స్టేషన్ బూర్జవలస, కె.కొత్తవలస, అడవి కొత్తవలస) గ్రామాల్లో చెట్లకొమ్మలు తొలగించే పనిలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ బి.రఘు, డీఈఈ జి.శివకుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 8:30 నుంచి 1:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు వారు తెలిపారు.

● రాజాం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 20న విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈ సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెయినెన్స్ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని బొబ్బిలిరోడ్, చీపురుపల్లి రోడ్, కంచరాం, ఆగూరు, అమరాం, దోసరి, రామినాయుడువలస, గడిముడిదాం, ఒమ్మి తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ వివరించారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ఆందోళన చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

మెరకముడిదాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న తమను వెంటనే రెగ్యులర్ చేయాలని మండలానికి చెందిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయం వద్ద వారు తమ డిమాండ్లతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. పీటీఐ నవీన్‌కుమార్, సీఆర్‌పీలు రాజినాయుడు, భారతి, కళ్యాణి, స్వప్న, చిన్న అప్పారావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సత్యవతి, ఎల్‌డీఏ పైడిరాజు, మెసెంజర్ ఉగాది తదితరులు పాల్గొన్నారు.

పీఎంఎవై అర్బన్ 2.0పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ డీఈఈ

బొబ్బిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పై శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ డీఈఈ రెడ్డి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనర్ లాలం రామలక్ష్మి పాల్గొని అందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పథకంలో లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష వెరసి రూ.2.50 లక్షలు చెల్లించనున్నాయన్నారు. అనంతరం పీఎం సూర్యఘర్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అంగీకార్-2025 ప్రచార కార్యక్రమాన్ని రెండు నెలలపాటు నిర్వహించనున్నట్లు డీఈ వివరించారు. అనంతరం మెప్మా ప్రతినిధులతో కలిపి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అనిల్‌కుమార్, కాంతారావు, వెంకటరమణ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ మేలు



రీజనల్ మేనేజరు నుంచి అవార్డు అందుకుంటున్న సత్యారావు

బొబ్బిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యోనో ఈ షీల్డ్ పథకం ద్వారా సహజ, ప్రమాద మరణాలకు రూ.40 లక్షల వరకు బీమా సుదపాయం ఉందని స్టేట్ బ్యాంకు రీజనల్ మేనేజరు బి.బి.సాహు తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యాపార కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాలకు చెందిన సీఎస్‌పీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల పట్ల గౌరవ మర్యాదలతో మెలిగాలన్నారు. నాణ్యమైన సేవలు అందించాలని హితవు పలికారు. రాబోయే రోజుల్లో ఈ కేంద్రాలు మరింతగా అభివృద్ధి దిశలో పయనిస్తాయన్నారు. అన్ని ప్రభుత్వ బీమా పథకాలన్నిటినీ వర్తింపజేయాలన్నారు. క్లెయిమ్ పొందలేని పక్షంలో ప్రీమియం వాపసు ఉంటుందన్నారు.- సేవా కేంద్రాల ద్వారా గృహ, వాహన, రైతు, ముద్ర, వ్యక్తిగత, ఎడ్యుకేషన్ రుణాలు, బంగారు ఆభరణాల తాకట్టు రుణాలకు ప్రాసెసింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన రామభద్రపురం సీఎస్‌పీ సత్యారావు పట్నాయక్‌తో పాటు పలువురికి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఐసీ మేనేజరు ఈశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రంగరాయపురంలో వైద్య శిబిరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘువంశీ

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): రంగరాయపురంలో శుక్రవారం పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రఘువంశీ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మహిళలకు అసంక్రమిత గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, బీపీ, షుగర్ ముందస్తు గుర్తింపునకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు, రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార ప్రాముఖ్యత కోసం అవగాహన కల్పించారు

మురుగునీటిలోని తాగునీటి పైపుల తొలగింపు



తాగునీటి పైపులను తొలగిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): అలజంగి గ్రామంలో మురుగునీటి కాలువల్లో ఉన్న తాగునీటి పైపుల తొలగింపునకు శుక్రవారం అధికారులు చర్యలు చేపట్టారు. 'మురుగునీటిలో తాగునీటి పైపులు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఇన్‌చార్జి ఎంపీడీవో భాస్కరరావు, సచివాలయం కార్యదర్శి స్పందించారు. శుక్రవారం తాగునీటి పైపులను మురుగుఉనీటి కాలువ నుంచి బయటకు తీయించారు. పైపుల జాయింట్ల వద్ద కొత్త పైపులు అమర్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యూరియా పంపిణీ పరిశీలన

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియాకు కొరత లేదని రైతులు అనవసరంగా ఆందోళన చెందవద్దని తహసీల్దార్ ఎం.శ్రీను అన్నారు. కాశిందొరవలస రైతు సేవాకేంద్రంలో శుక్రవారం యూరియా పంపిణీ కార్యక్రమం పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి సుమారు 250 బస్తాలు విడుదల అయిందనీ, రైతులందరికీ పంపిణీ చేస్తామన్నారు.

●బాడంగి, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): గొల్లాది, వాడాడ గ్రామాల్లో రైతులకు యూరియాను తహసీల్దార్ వరప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా వాడడం వల్ల అధిక దిగుబడి వస్తుందని వివరించారు. తక్కువ యూరియా రావడంతో రైతులకు ఇబ్బంది లేకుండా చూసేందుకు ఎస్ఐ తారకేశ్వరరావు సహకారంతో యూరియా పంపిణీ నిర్వహించారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

రామభద్రపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మా జీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆరోపించారు. మండల వైసీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా దొరకకపోవడంతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. అలాగే వైద్య కళాశాలను ప్రైవేటీకరించడం ఘోరమైన తప్పిదమని అన్నారు. సమావేశంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణ రావు, బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణ, చొక్కాపు చిన్నంనాయుడు (రామకృష్ణ) పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల భాష అభ్యసనలో విద్యార్థులకు భయం పోగొట్టేందుకు ప్రత్యేకంగా ఇంగ్లీష్ పాఠ్యాంశాల స్టడీ మెటీరియల్ రూపొందించానని రాష్ట్ర ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం (డెల్టా) అధ్యక్షుడు ఎం.విజయమోహన్ తెలిపారు. పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంబంధిత స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు హెచ్ఎం వేణుగోపాల్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ బాల బాలిక జట్టు ఎంపికలు రేపు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరికతోట జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక చేపట్టనున్నట్టు సాఫ్ట్‌బాల్ జిల్లా కోచ్, పిడి నల్ల వెంకటనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు అక్టోబరు 4, 5 తేదీల్లో విశాఖపట్నం కేడిపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సుస్థిర అభివృద్ధి సాధించాలి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా పంచాయితీలు పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అల్లు భాస్కరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీపీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించే ఏర్పాటు చేయాలన్నారు, క్షేత్రస్థాయిలో పంచాయతీలు, సచివాలయాల సిబ్బందికి ప్రజాప్రతినిధులకు సామర్థ్య పెంపుదలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాడంగి ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

22 నుంచి జ్ఞానసరస్వతి ఆలయంలో శరన్నవరాత్రులు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకూ జ్ఞాన సరస్వతి ఆలయంలో 21వ శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుడిశ శివకుమార్, చెరుకూరి శ్రీధర్‌లు తెలిపారు. వారు శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎస్‌వీఎన్ నగర్ రింగురోడ్డులో గల జ్ఞాన సరస్వతి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 29న మూలానక్షత్రం రోజున సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. 20న ఉదయం 7 గంటల నుంచి ఆలయ కౌంటర్ వద్ద అక్షరాభ్యాస కూపన్లు అందజేయనున్నట్టు తెలిపారు. 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు వివిధ విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

యూరియా పంపిణీకి పటిష్ఠ చర్యలు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

రాజాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు చూసి కలెక్టర్ ఆదేశాల మేరకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ ఎం.రాజశేఖర్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డులోని మన గ్రోమోర్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు, ఏవో చీకటి రఘునాథ్, సీఐ కె.అశోక్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అవసరమైన వారు 8333813281, 6309990826, 8331056204, 83331056237 నెంబర్లుకు సంప్రదించాలని కోరారు.

● గజపతినగరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కార్యాలయానికి 220 యూరియా బస్తాలు రాగా, వీటిని శుక్రవారం కాళంరాజపేట, డోలపాలెం గ్రామాల్లో పంపిణీ చేశారు. తహసీల్దార్ బి.రత్నకుమార్, ఏడీఏ జ్యోతి, రెవెన్యూ అధికారులు, పోలీసుల సమక్షంలో వీటిని పంపిణీ చేశారు. పీఏసీఎస్ సీవో నారాయణరావు, ఏవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

